విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



ఎస్‌టి నిరుపేదలకు జగనన్న ఇంటి లబ్ధిదారులకు రూ.15 వేల ఆర్థిక సాయం: మంత్రి కాకాణి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సర్వేపల్లి నియోజక వర్గంలోని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నగరం లోని డైకస్‌రోడ్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సర్వేపల్లి నియోజ కవర్గం లోని పొదలకూరు, తోటపల్లి గూడూరు మండలాలకు చెందిన గిరిజన హౌసింగ్ లబ్దిదారులకు రూ.15 వేల రూపాయల ఆర్థిక సాయం, చెక్కు లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సర్వేపల్లి నియోజక వర్గం లోని ఎస్టీ నిరుపేదలకు జగనన్న ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ సహాయంతో పాటు మరింత తోడ్పాటు అందించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సాయంతో పాటు అదనంగా ఎస్టీ లబ్ధిదారులకు రూ . 15వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా కాంట్రాక్టర్లను నియమించి ఎస్టీల ఇళ్ల నిర్మా ణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టి నట్లు చెప్పారు. సర్వేపల్లి నియోజక వర్గంలో సుమారు 4500 ఎస్టీ కుటుంబాలకు 15 వేలు చొప్పున ఏడు కోట్ల రూపాయలను అందజేసి ఇల్లు నిర్మించి ఇవ్వడం తన ప్రధాన బాధ్యతగా మంత్రి పేర్కొన్నారు. గిరిజనులందరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. పొదలకూరు, తోటపల్లి గూడూరు మండలాలకు చెందిన 82 మంది గిరిజనులకు రూ. 12.30 లక్షల విలువైన చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో డిఈఈ బివి సత్యనారాయణ రావు,ఏఈలు ముష్తాక్ బాషా, ఎంశివమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర -బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని జొన్నవాడ గ్రామంలో ఎల్బీ అన్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షి అమ్మవారి లకు శనివారం నెల్లూరు జిల్లా ముత్యాలపాలెం వాస్తవ్యులు పెనగలురు రామలింగయ్య కుటుంబ సభ్యులు శ్రీవార్ల నిత్య అన్నదానంకు రూ 100116లు నగదు రూపేణా విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు , దేవస్థాన సహాయ కమిషనరు, కార్య నిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు దాతలకు శ్రీవార్ల దర్శనం కల్పించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల శేషవస్త్రం, కుంకుమ, తీర్థ ప్రసాదాలు దాతలకు అందించారు.

ప్రశాంతంగా ఎల్ఆర్ అగ్రహారం పంచాయతీ ఎన్నికలు పర్యవేక్షించిన కావలి డీఎస్పీ

విశాలాంధ్ర- జలదంకి: శనివారం ఎల్ ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నిక కావలి డీఎస్పి వెంకటరమణ పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిసింది. ఈ పంచాయతీలో ఎప్పుడు కూడా ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన దాఖలాలు లేని కారణంగా పటిష్ట చర్యలు తీసు కున్నారు. డిఎస్పి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో ఎన్నికలకు తగిన పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీ లో 144 సెక్షన్ ను ముందు జాగ్రత్త గా మరొక రోజు పొడిగించామని డీఎస్పీ తెలిపారు.

పరిమితికిమించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించొద్దు: డీఎస్పీ

విశాలాంధ్ర - కావలి: పరిమితికి మించి ప్రయాణికులను ఆటో లో ఎక్కించరాదని, అతి వేగంగా ఆటోలను నడపరాదని అని కావలి డీఎస్పీ ఎం.వెంకట రమణ తెలిపారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ లో కావలి ఒకటవ పట్టణ సిఐ కే.శ్రీనివాసరావు, రెండవ పట్టణ సిఐ ఎ.సుధాకర్, సిబ్బందితో కలిసి ఆటో డ్రైవర్లు కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆటో కి చెందిన డాక్యుమెంట్స్ ఖచ్చితంగా కలిగి ఉండాలన్నారు. రూల్స్ అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వధూవరులను ఆశీర్వదించిన కృష్ణారెడ్డి

విశాలాంధ్ర - కావలి: రూరల్ మండలం చెంచుగానిపాలెం టీడీపీ నాయకులు నాసిన జాలరావు - రమాదేవిల కుమారుడు వంశీకృష్ణ వివాహ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, కావ్య కృష్ణారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కృష్ణారెడ్డి రాకతో కళ్యాణ మండపం సందడిగా మారింది. పేరు పేరున పిలుస్తూ అందరినీ ఆయన ఆప్యాయంగా పలకరించారు.

దళితుల పట్ల వివక్ష చూపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కావలి: గ్రామానికి సంబంధించి నిర్వహించే కార్యక్రమంలో అగ్రవర్ణాల వారు దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని, ఎలాంటి ఉద్రిక్తలు చోటు చేసుకోకుండా, దళితుల పట్ల వివక్ష జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జలదంకి మండలం గట్టుపల్లి గ్రామస్తులు ఆర్డీవో కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆర్డీవో ను కలసిన దళితులు మాట్లాడుతూ గ్రామంలో బొడ్డురాళ్ళను ప్రతిష్ట చేస్తున్నారని, ఇది పండుగ లాంటి కార్యక్రమం అని, ఇలాంటి కార్యక్రమంలో దళితులు ఉన్న చోట బొడ్డురాళ్ళను ప్రతిష్ఠించకుండా, మిగిలిన మూడు వైపులా ప్రతిష్టిస్తూ ఉన్నారని, ఇదేమని అడిగిన దళితుల పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ప్రతిష్ట సమయంలో దళితులు అడ్డు తగిలితే చంపి అయినా ప్రతిష్ఠింప చేస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. గతంలో దళితుల పై జరిగిన కారంచేడు, చుండూరు, తదితర మారణహోమాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్న అగ్ర వర్ణాల కులాల నుండి దళితుల ప్రాణాలను కాపాడాలని కోరారు. అలాగే దళితులను కలుపుకొని పోయి బొడ్డు రాళ్ళను వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ డి.ఎన్.మల్లి కార్జునరావు, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ పి.కాంతారావు, గట్టుపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస బుక్ స్టాల్ యజమాని మృతి

విశాలాంధ్ర - కావలి: పట్టణంలోని ట్రంక్ రోడ్డులో గల శ్రీనివాస బుక్ స్టాల్ యజమాని కోటా శ్రీనివాసరావు (61) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బోగోలు మండలం కొండబిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని స్కూటి పై తిరిగి వస్తుండగా ముసునూరు టోల్ ప్లాజా వద్ద నెల్లూరు వైపు నుండి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో బలమైన గాయాలు కావడంతో అక్కడి కక్కడే చనిపోయాడు. లారీ డ్రైవరు అతివేగంగా, అజాగ్రత్తగా నడు పుతూ వచ్చి ఢీకొన్నట్లు శ్రీనివాసరావు మేనల్లుడు పబ్బిశెట్టి వెంకట సురేష్ కుమార్ కావలి రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కావలి రూరల్ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి మృతుని మృత దేహాన్ని కావలి గవర్నమెంట్ హాస్పిటల్ కు పోస్ట్ మార్టం నిమితం పంపారు.

మహిళలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలి: టీడీపీ

విశాలాంధ్ర - కావలి: మహిళలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మహాశక్తి మహిళలు పేర్కొన్నారు. కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలం అనంతవరం పంచాయతీలో కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం శనివారం మహాశక్తి మహిళలు మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ.. వాకిళ్ళకు మహాశక్తి స్టిక్కర్లు అతికిస్తూ తెలుగుదేశం పార్టీ ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, మాలేపాటి నాయకత్వం వర్ధిల్లాలి, మహాశక్తి వర్ధిల్లాలి అంటూ మహిళలు నినాదాలు చేశారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలకు ఉన్న సౌలభ్యాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. చంద్రబాబుని గెలిపించుకోవడమే మహాశక్తి ధ్యేయమని అభివర్ణించారు. మహిళల ప్రోత్సాహంతో టీడీపీని గెలిపించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడ ముఖ్యమంత్రిగా గెలవాలని ఆశీర్వదించిన పసుపుతాళ్లను మహాశక్తి మహిళా నేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి మహిళా నేతలు కొల్లూరు అశ్విని, గోళ్ళ అమర జ్యోతి, రాపూరి రాధమ్మ, టీడీపీ ముఖ్య నాయకులు పోడమేకల కొండయ్య, నరహరి హరిబాబు, పడమేకల హరీష్, గోపసాని అనిల్, అడప లక్ష్మయ్య, నున్న కొండయ్య, గోపసాని పెంచలయ్య, అడప వెంకట్రావు, ఘటాల మాల్యాద్రి, బత్తల మాల్యాద్రి, వంటేరు రత్తయ్య, బత్తల మల్లి, గోపసాని సీనయ్య, ఘటాల లక్ష్మి, రజిని, కరణం పద్మ, నున్న లక్ష్మి, కోపసాని మాధవి, అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

24న చలో విజయవాడను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కావలి: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరు తూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్మికులు జయప్రదం చేయాలని నాలుగవ డివిజన్ మస్టర్ పాయింట్ వద్ద శనివారం సిఐటియు నాయకులు పిలుపు నిచ్చారు. అనంతరం కార్మికులతో సిఐటియు నాయకులు పసుపు లేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్స రాలుగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని, కనీస వేతనాలు అమలు చేయలేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని, ఇన్సూరెన్స్ విధానం అమలు చేయలేదని, ఇంకా అనేక సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరిం చాలని కార్మికులు దశల వారి పోరాటాలను కొనసాగించిన కంటి తుడుపు చర్యలతో కాలయాపన చేసిందని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్య లు అలాగే మిగిలి ఉన్నాయని, ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్మికులకు ఇచ్చిన పర్మినెంట్ హామీని నేటికీ అమలు చేయలేదని, ఇది చాలా అన్యాయమన్నారు. ఉదయాన్నే పట్టణాలను, పల్లెలను శుభ్రపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడే మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించు కోవట్లేదని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24వ తేదీన సిఐటియు రాష్ట్ర కమిటీ చలో విజయవాడ పిలుపు ఇచ్చిందని, ఆ పిలుపులో భాగంగా 24వ తేదీన సిఐటియు అనుబంధ కార్మికు లు మస్టర్ల ను నిలిపివేసి చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఈ పోరాటం ద్వారా నైనా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు తురక సీనయ్య, నాయకు లు ఒంగోలు రమేష్, జలదంకి బాబు, ఎస్ ఆనందరావు, మహిళా నాయకులు పిచిన్నమ్మ, ఆర్ అనురాధ, కార్మికులు పాల్గొన్నారు.

దళితులకు పదవులు ఇవ్వడం నైనై.. కేసులు పెట్టడానికి సైసై : టీడీపీ

విశాలాంధ్ర - కందుకూరు రూరల్: దళితులకు దక్కాల్సిన చట్టబద్ధమైన నామినేటెడ్ పోస్టులను ఇవ్వకుండా దళితుల ద్వారా ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయించడంలో స్థానిక ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. చిన్న పవని గ్రామంలో కోపరేటివ్ బ్యాంకు ద్వారా రుణం తీసుకున్న దివి వెంకట రమణయ్య అనే రైతుపై రాత్రికి రాత్రి ఆస్తులను జప్తు చేయడానికి యాజమాన్యాన్ని సిద్ధం చేశారని చెప్పారు. ఆ రైతు చేసిన నేరం ఏమిటి అంటే పంచాయతీ వార్డు ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకుడు వచ్చి దివి వెంకటరమణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయమని అడిగాడు. తాను టిడిపి అభ్యర్థికి ఓటు వేస్తానని స్పష్టం చేయడంతో అతను తీసుకున్న కోపరేటివ్ బ్యాంకు రుణానికి సంబంధించి చెల్లింపులు జరగలేదని ఆగమేఘాలమీద ఆస్తులను జప్తు చేస్తున్నట్లు దండోరా వేయించడం కక్షపూరితమైన చర్యగా ఆయన అభివర్ణించారు. మరుసటి రోజు బ్యాంకు వద్దకు వెళ్లి లోను చెల్లింపుల విషయం వాకప్ చేయడానికి సంబంధిత సిబ్బందిని అడిగే టప్పుడు అక్కడ ఉండే ఒక ఉద్యోగిపై బులుసుగా ప్రవర్తించాడని ఆ కారణంగా లేనిపోని నిందలు మోపి వెంకట రమణయ్య పై ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేయించడం ఎమ్మెల్యే కక్షపూరితచర్యగా ఆయన పేర్కొన్నారు. దళితులపై ప్రేమను నటిస్తూ వారికి చట్టబద్ధంగా లభించాల్సిన నామినేటెడ్ పోస్టులను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దాటవేస్తూ దళితులను మోసం చేస్తున్నారని ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానికంగా రెండేళ్ల నుంచి ఏఎంసి చైర్మన్ పదవిని దళిత మహిళకు కేటా యిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఆ పదవిని దళిత మహిళలకు కట్టబెట కుండా దళిత హక్కులను చేస్తున్నారని నిర్వీర్యం ఆయన ఎమ్మెల్యే పై విరుచుకుపడ్డారు. అదేవిధంగా మాలకొండ దేవస్థానం చైర్మన్ పదవి ఎవరికి ఇవ్వకుండా ప్రతి శనివారం మాలకొండ దేవాలయ ప్రాంతాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చి వేస్తున్నారనిధ్వజమెత్తారు. ప్రతి శనివారం దేవుని సేవలో భాగంగా మాలకొండపై సేవలు చేయడానికి ముందుకు వెళ్లే వారికి అవకాశం ఇవ్వకుండా వైసిపి కార్యకర్తలు అక్కడ పెత్తనం చెల యిస్తు న్నారని ఇంటూరి విమర్శించారు. అందుకు తగ్గట్లుగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారికి వందపాటుతో ఆలయ నియ మ నిబంధనలను తొక్కుతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు. కందుకూరు నియోజకవర్గం అన్ని మండలాలు అవినీతి తాండ విస్తుందన్నారు. ఇసుక తరలింపు మట్టితోలకం, లిక్కర్ వ్యాపారం, రేషన్ బియ్యం రహస్య వ్యాపారం కోట్ల రూపాయల మేర జరుగుతుంది ఆయన వెల్లడించారు. ప్రతి విషయంలో అక్రమార్జన ద్వారా లక్షలు సంపాదించడానికి నియోజక వర్గంలో గేట్లు బార్లా తెరిచారు.పైకి ఇక్కడ అవినీతికి వ్యతిరేకమని కల్లబొల్లి మాటలు చెబుతూ వాస్తవానికి వైసిపి నాయకుల దోపిడీకి అంతు లేకుండా పోయిందన్నారు. నియోజక వర్గంలో శనివారం జరిగిన రెండు వార్డులకు టిడిపి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు నాగేశ్వరరావు ధన్యవాదాలుతెలిపారు. నియోజకవర్గంలో ఇదే పరంపర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీసీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి చిలకపాటి మధు, నెల్లూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ నాయకులు గోచిపాతల మోషే పాల్గొన్నారు.

2024 లో చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి: మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ముఖ్యమంత్రి పీఠాన్ని నారా చంద్రబాబు నాయుడు అధిరోహించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం చెప్పారు. శనివారం సాయంత్రం కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ఈ నాలుగు సంవత్సరాలలో ప్రజా వ్యతిరేక చర్యలను అవలంబించిన అందని ఈరోజు జరిగిన పంచాయతీ సర్పంచ్ వార్డు ఎన్నికల్లో టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలుపునిందన్నారు. ప్రతి విషయంలో ప్రజావ్యతిరేక నిర్ణయాలను అవలంబించి ముఖ్యమంత్రి ప్రజా కంటకుడుగా మారారని ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతాంగ ప్రయోజనాలను నెరవేర్చకపోవడంతో జగన్మోహన్ రెడ్డి అసలు రంగు బయట పడిందన్నారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యమంత్రి ప్రజల ఆగ్రహాన్ని చవిచూశారన్నారు. ఇప్పుడు జరిగిన పంచాయతీ ఎన్నికలు రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సెమీ ఫైనల్ గా చెప్పవచ్చు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల నాటి నుంచి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు స్ప ష్టంగా కనిపి స్తున్నాయ న్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి ప్రజలు తెలుగు దేశం పార్టీకి బ్రహ్మ రథం పడుతు న్నారని చెప్పారు. వేల కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగనామం పెట్టిన బడా పారిశ్రామిక వేత్తలను మొదలుపెట్టి రైతులు పై తప్పుడు కేసులు బనాయించి వారిని ఇబ్బందులు పెడుతు న్నారని శివరాం వెల్లడించారు. చిన పవని గ్రామంలో సహకార బ్యాంకులో రుణం తీసుకున్న ఒక వ్యక్తిని ఇబ్బందులకు గురి చేసారని ఆయన చెప్పారు. పంచాయతీ వార్డు ఎన్నికల్లో లోను తీసుకున్న రైతు తాను తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి మాత్రమే ఓటు వేస్తానని స్పష్టం చేయడంతో ఆ రైతును ఇబ్బందులకు గురి చేశారని వెల్లడించారు. ఇలాంటి చర్యలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన ఆయన మిన్న కుండడంలో ఆంతర్యం ఏమిటని శివరామ్ ప్రశ్నించారు. రైతులను ఇలా ఇబ్బందులు పెడుతుంటే మీరు సమర్థిస్తారా అని ఎమ్మెల్యేని శివరామ్ ప్రశ్నించారు. ప్రజలను బాధ పెట్టడం మానుకోవాలని ఆయన ఎంతో పలికారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తమ పార్టీ సిద్ధంగా ఉందని శివరాం చెప్పారు.

అరసం లిటరరీ ఫోరంకు కేంద్ర సాహిత్య అకాడమీ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కేంద్ర సాహిత్య అకాడమీఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లాశాఖ సౌజన్యంతో లిటరరీ ఫోరం జరగ నుంది. తొలితరం సాహిత్య అకాడమీ తెలుగు రచయితల గ్రంథాలపై ప్రముఖులు ప్రసంగిస్తారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామ కృష్ణ సమన్వయ కర్తగా సభకు అధ్యక్షత వహిస్తారు. అరసం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బాల సాహిత్య వేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ విశిష్ట అతిథిగా వ్యవహరిస్తారు. అరసం నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె కరుణశ్రీ స్వాగత ఉపన్యాసం చేస్తారు. డికె డబ్ల్యూ మహిళా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సదస్సు ప్రారంభం చేస్తారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వంపై గుంటూరు నుండి విచ్చేసే డాక్టర్ దివి జాదేవి, రాయప్రోలు సుబ్బా రావు రచన మిశ్రమంజరిపై డాక్టర్ పద్మప్రియ, గుర్రం జాషువ రచన క్రీస్తు చరిత్రపై కోటకు చెందిన కవి డాక్టర్ పెళ్ళూరు సునీల్, తుమ్మల సీతారామ్మూర్తి రచన మహాత్మకథ గురించి డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, దొడ్ల కౌశల్యమ్మ, మహిళా కళాశాల ఈ తరం విద్యార్థినులకు పరిచయం చేస్తారు. జిల్లా సాహితీ ప్రియులు అందరికీ అరసం సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికారు.

శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - బ్యూరోనెల్లూరు: గొలగమూడి లో భగవాన్ వెంకయ్య ఆరాధన సందర్భం గా ఆలయ ప్రాంగణంలో భక్తుల దర్శనం, భోజన సదుపాయం, కోనేరు, పార్కింగ్ పాయింట్లను స్వయంగా పరిశీలించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసిన యస్పి తిరుమలేశ్వరరెడ్డి ప్రవేశం, నిష్క్రమణ మార్గాల వద్ద క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాట్లు పరిశీలనభక్తులకు పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలి. ఎటువంటి అత్యవసర సహాయమైన పోలీసు వారిని సంప్రదించం డి.. నిరంతరం అందుబాటులో ఉంటామని పోలీస్ అవుట్ పోస్ట్ ను పరిశీలించి, భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించు కొని, నెల్లూరు పోలీస్ వారికి సహకరించి ఈ ఆరాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆపద్బాందవ అధ్వర్యంలో భోజన ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర - కావలి: ఆపద్బాందవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కావలి పట్టణంలో రోడ్డుసైడ్ ఆకలితో ఉన్న ఆన్నార్తులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పిడుగురాళ్ల వద్ద అనుపాలెం లోని మదర్ ఫాదర్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేముల ధనంజయ గోపి తల్లి వేముల రమణ 5వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ధనంజయ గోపి మాట్లాడుతూ చిన్న వయసు లోనే అమ్మను, నాన్నను కోల్పోయిన నేను వాళ్ల గుర్తుగా మదర్ ఫాదర్ మెమోరియల్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, ఈరోజు మా అమ్మ 5వ వర్ధంతి సందర్భంగా కావలి లోని ఆపద్బాందవ సేవా ట్రస్ట్ చైర్మన్ దామ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో అన్నదానం చేసామనిపేర్కొన్నారు. అన్నదాత ధనంజయ కి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణ వైద్యుడు తురక శ్రీనివాసులు కి ట్రస్ట్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

శంభుని కాపులను ఎస్‌సి జాబితాలో చేర్చడం చట్ట విరుద్ధం

- 21వ తేదీన మహాధర్నాని విజయవంతం చేయాలి

- దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి

విశాలాంధ్ర - కావలి: శంభుని కాపులకు ఎస్సీ హోదాతో ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వడం చట్ట విరుద్ధం అని స్థానిక ఎమ్మెల్యే ద్వారా అధికారులపై ఒత్తిడి చేయడం తగదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. శనివారం కావలి పట్టణంలోని రైల్వే రోడ్ లోని జర్నలిస్ట్ క్లబ్ లో ఆయన పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో అక్కడక్కడ శంభుని కాపులు ఉన్నారని, వారు మద్రాస్ నుండి తీర ప్రాంతాలకు వచ్చారని, మన కావలి నియోజకవర్గంలో మూడు గ్రామాల్లో ఉన్నారని తెలిపారు. వారికి గతంలో జీవో నెంబర్ 25 తీసుకుని రావడం ద్వారా ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకోవడం జరిగిందని, తద్వారా ఉద్యోగాలు కూడా పొందారని, దీనిపై హైకోర్టు సమగ్ర విచారణ జరిపించి, ఆ జీవోను కొట్టి వేసిందని, ఆ నియమకాలు కూడా రద్దు చేశారని అన్నారు. శంభుని తెగలు ఎలాంటి అంటరానితనం గాని, ఆర్థిక, సామాజిక రంగాలలో ఎలాంటి వెనుకబాటుతనం లేదని, అలాంటి వారికి ఎస్సీ హోదాతో సర్టిఫికెట్ ఇవ్వటం తగదని హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టి వేసిందని తెలిపారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తీరప్రాంత గ్రామాలలో పర్యటిస్తూ వారికి గతంలో రద్దు చేసిన దానిని పునరుద్ధరించి వారికి సర్టిఫికెట్లు జారీ చేయడానికి అన్ని ప్రయత్నాల్లో ఉన్నారని, కలెక్టర్, ఆర్డిఓ తోటి మాట్లాడాలని, హైకోర్టులో కూడా పిటిషన్ వేశానని, టీవీలు ద్వారా ప్రచారం చేసి ఉన్నారని తెలిపారు. గతంలో కూడా ఒక ఎమ్మెల్యే ఇలాగే చేసి అబాసుపాలయ్యారని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి దళితులైన మాల, మాదిగల నోరు కొట్టడం మంచిది కాదని అన్నారు. తీర ప్రాంత గ్రామాలలో మంచి ఆర్థిక బలం ఉన్నవారికి ఎస్సీ సర్టిఫికెట్లు ఇస్తామనడం కులాల మధ్య చిచ్చు పెట్టడంఅని, ఇలా చేయడం తగదన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల ముందు ఇలాంటి జిమ్మిక్కులు చేయడం సహజమని తెలియజేశారు. కాపులకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా రాజ్యాంగపరంగా చట్టపరంగా వ్యవహరించాలని తెలియజేశారు. 21వ తేదీ కావలి పట్టణంలోని ఆర్.డి.ఓ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.అశోక్, ఎం.మోహన్ రావు, జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మయ్య, చౌటూరి వెంకటరత్నం పల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో ఇంటూరి రాజేష్

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: కందుకూరు పట్టణంలో 25 వ వార్డు టిడిపి మాజీ అధ్యక్షులు పెంట్రాల సుబ్బారావు, సుజాత కుమార్తె వర్షిని - దినేష్‌ల నిశ్చితార్థ వేడుకలకు శనివారం కందుకూరు నియోజకవర్గం యువ నాయకులు, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ పార్టీ నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

కప్పరాళ్ల తిప్పలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర- బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ కప్పరాళ్ల తిప్ప సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆడిటో రియంలో శనివారం ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్య సంఘం, స్వర్ణభారత్ ట్రస్ట్ నేత్ర వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమైనట్లు గుర్తించామన్నారు. ఆపరేషన్ అవసరమైన రోగులకు వెంకటాచలంలోని తమ వైద్యశాల లో ఉచితంగా ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఎస్. వెంకటరావు, బి. ప్రవల్లిక పాస్టర్ పోలయ్య, గ్రామ పెద్దలు ఆకుల డేవిడ్, పాల్ మేకల సాల్మన్ రాజు, ఆవుల నాగేశ్వరరావు , విజయభాస్కర్ పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి విజయం

విశాలాంధ్ర- కొండాపురం: మండలంలోని టీడీపీ అభ్యర్థి విజయం దండాపురం, మండలం లోని సాయిపేట ఓటు వేసేం దుకు క్యూలో ఉన్న ఓటర్లు గెలుపు ధృవపత్రంతో టీడీపీ అభ్యర్థి సానంగుల రవీంద్ర శాంతంగా ముగిసిన పోలింగ్ పంచాయతీ 3 వార్డు ఉప ఎన్నిక శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 340 మంది ఓటర్లుండగా 251 ఓట్లు పోలయినట్లు అధికారులు తెలిపారు. 136 మంది పురుష, 115 మంది స్త్రీ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. టీడీపీ సానుభూతిపరులుగా సానంగుల రవీంద్ర, తురకా అంకబాబు, వైసీపీ సానుభూతి పరుడిగా బండారు తిరుపతయ్య తమ అదృష్టాన్ని పరీక్షించు కున్నారు. వీరిలో టీడీపీ అభ్యర్థి సానంగుల రవీంద్రకు 146 ఓట్లు, తురకా అంక బాబుకు 81 ఓట్లు. వైసీపీ అభర్థి బండారు తిరుప తయ్యకు 20 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు చెల్లనివిగా మిగిలాయి. పోటీ టీడీపీ వర్సెస్ టీడీపీగా ఉండి చివరకు సానంగుల రవీంద్ర 65 ఓట్ల మెజారిటీతో గెలిచారు. కాగా మండలంలో 3 పంచా యతీలలో జరిగిన 3 వార్డుల ఉప ఎన్నికలలోనూ టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాటుచేశారు.

ఎల్ఆర్ అగ్రహారం సర్పంచ్ పదవి టిడిపి ఖాతాలోకి

సర్పంచిగా మంగళ తిరుమల

విశాలాంధ్ర- జలదంకి: జల దంకి మండలంలోని ఎల్ ఆర్ అగ్రహారం పంచాయ తీ సర్పంచ్ ఉప ఎన్నిక శనివా రం జరిగింది. త్రిముక పోటీ జరగగా సర్పంచ్ గా మంగళ తిరుమల సమీప ప్రత్యర్థిపై 88 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నికల అధికారి ఇవి ప్రసాద్ డిక్లరేషన్ పత్రాన్ని సర్పంచ్ కి అందజేశారు. టిడిపి మద్దతు దారునిగా తిరుమల విజయం సాధించడంతో ఎల్ఆర్ అగ్రహారం సర్పంచ్ టిడిపి ఖాతాలోకి చేరింది. ఈ సంద ర్భంగా తిరుమల మాట్లాడుతూ ఉదయగిరి మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు, ఎల్ ఆర్ అగ్రహారం నాయకులు కొర్రపాటి రామారావు గుర్రం ప్రవీణ్ ల సహకారంతో తాను విజయం సాధించానన్నారు. తన విజయానికి కారణమైన గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని, ప్రజలకు సేవ చేస్తూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వేములపాడు పంచాయతి లోని 7వ వార్డు ఉప ఎన్నిక జరుగగా పొట్లూరు ఆదిలక్ష్మమ్మ విజయం సాధించారు.

12వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల మేనిఫెస్టోను వైసీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన వివరాలను వివరిస్తూ 12వ వార్డులో గడప గడప కార్యక్రమం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్ద నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. జగన్మోహన్ రెడ్డిని ఆయన కొనియాడారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం

మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

విశాలాంధ్ర -జలదంకి: 2024లో జరిగే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయ దుందుభి మోగిస్తుం దని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు నిదర్శనం ఈరోజు జరిగిన పంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుల ఉప ఎన్నికలన్నారు. శనివారం ఆయన ఎల్.ఆర్ అగ్రహారంలో విజయం సాధించిన సర్పంచ్ మంగళ తిరుమలను అభినందించేందుకు గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ ఉదయగిరి నియోజక వర్గంలో 15 వార్డులకు ఉప ఎన్నికలు జరగగా 10 వార్డులు టిడిపి మద్దతుదారులు విజయం సాధించారన్నారు. నియోజకవర్గంలో ఎల్ ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ కి జరిగిన ఎన్నికలో పార్టీ బలపరిచిన అభ్యర్థి మంగళ తిరుమల ఎన్నికయ్యారు అన్నారు. నియోజకవర్గంలో 3600 కోట్లతో తాను అభివృద్ధి పనులు చేశానని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలవడమే కాక, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కానున్నారని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో ప్రజలు విసుగు చెంది ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అయితేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. నూతన సర్పంచ్ తిరుమల తో పాటు, కొర్రపాటి రామారావు, గుర్రం ప్రవీణ్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి, పచ్చ పెంచల నాయుడు, కంచర్ల వినోద్, మేదరమెట్ల శేషారెడ్డి, స్వర్ణ కొండప నాయుడు పాల్గొన్నారు.

వాలంటీరు కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-అనుమసముద్రం పేట: ఏఎస్‌పేట మండలంలోని అనుమ సముద్రం గ్రామం కు చెందిన వాలంటీరు కప్పల బాబు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నుంచి ఐదు లక్షల రూపాయలు చెక్కును ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అందజేశారు. వాలంటీర్ గా విధులు నిర్వర్తిస్తున్న కప్పల బాబు రెండేళ్ల క్రితం మృతి చెందారు. మండల వైసీపీ కన్వీనర్ పందిల్లపల్లి సుబ్బారెడ్డి , మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సందాని బాషా కప్పల బాబు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు తోడ్పడాలని వారి కుటుంబ పరిస్థితిని రెండు నెలల క్రితం ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి వివరించి సంబంధిత పత్రాలను అందజేసారు. సమస్యను విన్న మేకపాటి విక్రం రెడ్డి సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి తక్షణమే బాబు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని అభ్యర్థిం చారు .అందుకు సానుకూలంగా స్పందించి న జగన్మోహన్ రెడ్డి కప్పల బాబు కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు ముఖ్య మంత్రి సహాయనిధి మంజూరు చేసారు. మేకపాటి విక్రమ్ రెడ్డి చేతులమీదుగా మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం నందు మేకపాటి స్వగృహంలో కప్పల బాబు కుటుంబ సభ్యులకు ఐదు లక్షల 5లక్షల రూపాయల సహాయ నిధి చెక్కును అందించారు. కుటుం బంలో ఒకరిని అప్పట్లోనే వాలంటీర్‌గా నియమించారు. వారి సమస్యను శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి పై సహాయం అందేందుకు తోడ్పాటు అందించిన ఏఎస్ పేట మండల వైసీపీ కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి కి,ఏఎస్ పేట మండల జిల్లా పరిషత్ సభ్యురాలు పందిళ్ళపల్లి రాజేశ్వరమ్మ కి,ఏఎస్ పేట మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందాని బాష కి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పేట మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సందాని బాషా,అనుమ సముద్రం ఉప సర్పంచ్ షేక్ షేరాజ్ అలీ,యువ నాయకుడు పఠాన్ దావుద్ ఖాన్ పాల్గొన్నారు.

సుభోజనం అద్భుతం: ఎంపీ ఆదాల

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పేదలకు అన్నం పెట్టే సుభోజనం కార్యక్రమం అద్భుతమని నెల్లూరుఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. ప్రభుత్వ పెద్ద ఆసుపత్రిలో శనివారం హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ట్రస్ట్ వారు నెల్లూరు ఆస్పత్రికి వచ్చే రోగులతో ఉండే సహాయకులకు సుభోజనంను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ హరే కృష్ణ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల మందికి, తెలంగాణలో కోటి మందికి పైగా అన్నార్తులకు భోజనాన్ని సమకూరుస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ధార్మిక సంస్థలలో ఇది ఒకటి అని పేర్కొన్నారు. త్యాగ నిరతితో చేపట్టిన ఈ మంచి కార్యక్రమం అందరికీ గర్వ కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు నడుపుతున్న దాతలకు అభినందనలు తెలిపారు. హరే కృష్ణ సంస్థ మరెన్నో మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కలెక్టర్ హరి నారాయణన్, హరే కృష్ణ సంస్థ ప్రతినిధి వంశీధర దాసు, డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్ర, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

నైపుణ్య ఇంజినీర్లకు చిరునామా ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: మల్టీ నేషనల్ కంపెనీలకు తగిన నైపుణ్యాలతో ఇంజనీర్లను తయారుచేసే సమర్థమైన పరిశ్రమగా, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీని తమ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ శ్రీనివాస్ తీర్చిదిద్దారని కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య ఆకాంక్షించారు. సి.అర్.టి ఎగ్జామ్స్ లో ప్రతిభ కనబరిచిన ఫైనల్ ఇయర్ బీటెక్ విద్యార్థులను అభినందించారు. అనంతరం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ అందిం చిన మ్యాక్స్ సంస్థ సీ.ఈ.ఓ కోటిరెడ్డి విద్యార్థు లు పట్టుదలతో టెన్త్ క్లాస్ ఫెయిల్ అయినప్పటికీ క్రికెట్ చరిత్రలో ఉన్నత స్థానాన్ని అధిరోహించిన సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజాలను స్ఫూర్తిగా తీసుకొని కృషి చేస్తే సామాన్య విద్యార్థి కూడా మల్టీ నేషనల్ కంపెనీస్‌లో ఉద్యోగాన్ని సాధించవచ్చు అన్నారు. ఉద్యోగ మాంద్యం నెలకొన్న ఈ కఠిన పరిస్థితులను అధిగమించి ఉద్యోగాన్ని సాధించేలా ప్రణాళిక రూపకల్పన చేసి, దానికి తగినట్టుగా విద్యార్థులను నిరంతరం పట్టుదల క్రమశిక్షణతో శ్రమించేలా చేసి డిగ్రీ తో పాటు ఉద్యోగ ఆఫర్ లెటర్ అందించడమే తమ కాలేజీ లక్ష్యం అని, దానికి తగినట్టుగా ఫైనల్ ఇయర్ విద్యార్థులు చేస్తున్న కృషి తమ సంకల్పాన్ని నెరవేరుస్తాయని డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ ఆకాంక్షించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ రవికుమార్ మాట్లా డుతూ విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహిం చడానికి ఇలాంటి క్యాష్ అవార్డులను అందించడం విద్యార్థుల పట్ల కాలేజీ యాజమాన్యానికి ఉన్న నిబద్ధత అన్నారు.యస్ సింధు ప్రియ, కే నగ పూజిత, కే లక్ష్మీ పూజిత, గుర్రం లక్ష్మీ శ్రావ్య, కొండారెడ్డి శ్రీ లక్ష్మి, పి.స్పందన, కే.సాయికుమార్ రెడ్డి, మోతుకూరి విజయ భార్గవి, రాగి మదన్, పంచేటి అఖిల మొదలగు విద్యార్థులకు క్యాష్ అవార్డులను రామయ్య, విజయ్ శ్రీనివాస్ మరియు కోటి రెడ్డి అందించారు.ఈ కార్యక్రమం నందు అకడమిక్ ఇంచార్జ్ ఎస్.ఎన్ మీరావాలి, టి.పి.వో బాలకృష్ణ తో పాటు డిపార్టుమెంట్ ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్స్ ఎస్.ఎం మాధవ రావు, గద్దే సురేష్, కొల్లా కోటయ్య, శ్రీనివాసరెడ్డి, మీరా షరీఫ్ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలు ఒక్కొక్కటి పూర్తి కావడం ఎంతో ఆనందం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: పేదల ఇళ్ల నిర్మాణాలు ఒక్కొక్క టి పూర్తి కావడంత నమనసుకుఎంతో సంతృప్తి నిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికాకాణిగోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం సర్వేపల్లి నియోజకవర్గం లోని వెంకటా చలం జగనన్న కాలనీని సందర్శించిన మంత్రి, స్థానిక ఎంపీడీ వో కార్యాలయంలో వెంకటాచలం మండలానికి చెందిన గిరిజనుల ఇంటి నిర్మాణానికి రూ 15 వేల రూపాయల ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లులేని పేదలు ఉండకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిం దన్నారు. గతంలో ఇళ్ల స్థలాల కోసం కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత మందికి అర్హత ఉంటే అంత మందిక "ఇళ్లస్థలాలు ఇచ్చిఇల్లు కట్టించినట్లు చెప్పారు. వెంకటాచలంలో కోట్లాది రూపాయల విలువచేసే భూములను కొనుగోలుచేసి పేదల ఇంటి నిర్మాణానికి కేటా యించి, ఇల్లు కట్టుకోవ దానికిరూ1.80 లక్షలు మంజూరు చేసామని చెప్పారు. ఈ లేఅవుట్ లో 9 అంకణాల స్థలం విలువ సుమారు 5 లక్షల పైగా ఉందన్నారు. ఇంతటి ఖరీదైన స్థలాల్లో నిరుపేదలు చక్కగా ఇళ్లను నిర్మించుకోవడం తనకు ఆత్మ సంతృప్తిగా ఉందన్నారు. ఒకటిన్నర సెంటు స్థలంలో ఏం ఇల్లు కట్టుకుంటారని ఎగతాళి చేసిన వారికి పూర్తి చేసుకున్నఈ అందమైన ఇళ్లులే సమాధానంచెబుతాయన్నారు. ఖరీదైన ఈ లేఅవుట్లో పేదలకు స్థలాలు ఇస్తే ఎక్కడ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందేమోనని భావించి, ఇవి దేవాదాయ భూములని, ఇక్కడ స్థలాలు ఇవ్వకూడదని కొంతమంది దురుద్దేశంతో కోర్టుల్లో కేసులు వేశారని, అన్నీ అడ్డంకులను అధిగమించిఇక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు మంత్రి గుర్తు చేశారు. అలాగే నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు త్వరగా ఇల్లు నిర్మించుకునేందుకు అన్ని విధాల అండగా నిలుస్తున్నామని, పొదుపు సంఘాల ద్వారా రూ 35వేలు వడ్డీ లేని రుణాన్ని అందజేయడంతో పాటు, సంఘాల్లో సభ్యులుగా లేని వారికి రూ:15వేలు పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగంగా పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టర్లు కూడా గిరిజనుల ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా ఇల్లు కట్టించి ఇవ్వాలని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. వచ్చేనెల నుంచి అన్ని లేఅవుట్లలోపూర్తయిన ఇళ్లకు గృహప్రవేశాలు చేస్తామని మంత్రి చెప్పారు. తొలుత జగనన్న కాలనీలో పూర్తయిన ఇంటిని మంత్రి ప్రారంభించి, ఆ కుటుంబ సభ్యులను అభినందించారు. తమకు ఖరీదైన స్థలాన్ని మంజూరుచేసి తమ సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రికి, మంత్రికి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాలనీలోని పలు ఇళ్లను మంత్రి సందర్శించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో 108 మంది గిరిజనులకు ఇంటి నిర్మాణా లకు రూ.15వేలు అదనపు ఆర్థిక సాయం చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో వెంకట రమేష్, డిఈఈ బివి సత్యనారాయణరావు,ఎఈ సిహెచ్ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత, స్థానిక ప్రజా ప్రతినిధులు మందల వెంకటశేషయ్య, కోదండరామిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన పీడీ

విశాలాంధ్ర బిట్రగుంట: బోగోలు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆ ప్రాజెక్టు జిల్లా పథక సంచాలకులు డి వెంకట్రావు తనిఖీ చేశారు. ముందు మండల ఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణం పనులను పరిశీలించారు. సహజ వనరుల ద్వారా లభించే వర్షపు నీటిని భూమి లోకి ఇంకింప జేసి భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఈ నిర్మాణం దోహదం చేస్తుందన్నారు. సిద్దవరం వెంకటేశ్వరపాలెంలో జరుగుతున్న సాగునీటి చెరువు పూడికతీత పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, సచివాలయ సిబ్బంది పనితీరుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏపిఓ శ్రీనివాసులు, ఈసి రవికుమార్, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన బిడ్డల చదువుకు పొంగూరు సింధూర సాయం

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: వారంతా గిరిజన బిడ్డలు ప్రభుత్వం పట్టించుకోక చదు వుకు దూరమైన బావి భారత పౌరులు వారిలో చదువు మీద అశను పెంచేందుకు మాజీ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె సింధూర ముందడుగు వేసింది. గాంధీ గిరిజన కాలనీలో ఉన్న చిన్నారులకు దుస్తులు, యూనిఫాం అందించి చదువుకుంటే కలిగే ప్రయోజనాలు వివరించారు. 53వ డివిజన్ లో నారాయణ కాలేజ్ , స్కూల్లో చదువుకున్న స్టూడెంట్స్ ను వెంట బెట్టుకుని చదువు గొప్పతనం తెలియ చెప్పారు. భవిష్యత్తులో తాను, మాజీ మంత్రి నారాయణకు అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. దీంతో అక్కడ ఉండే స్థానికులు తమ బిడ్డల్ని క్రమం తప్పకుండా స్కూల్‌కి పంపిస్తామని ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

22న శాంతియుత ర్యాలీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: ఈనెల 22వ తేదీ బుచ్చిరెడ్డిపాలెం యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించే శాంతి యుత ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐసీయు నాయకులు కోరా రు. దగదర్తి సంఘం బుచ్చిరెడ్డి పాలెం మూడు మండలాలు కలిపి బుచ్చిరెడ్డిపాలెంలో చర్చి నుండి తహశీల్దార్ కార్యాలయం మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు, అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుత ర్యాలీ జరుగుతుందని ఏఐసీయు నాయకులు జాన్ పాల్ తెలిపారు. శనివారం ఆయన బుచ్చిరెడ్డిపాలెం లోని తెలుగు బాక్స్ సంఘం చర్చిలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ బహిరంగ ర్యాలీ ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ఏఐసీయూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అందరు ప్రజలు కలిపి విజయవంతం చేయాలని క్రిస్టియన్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. యుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రభు కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న మణిపూర్‌లో మహిళలను భయంకరంగా హింసించారన్నారు. దేశంలో ఉన్న వారికి అవమాన కరమన్నారు భారత దేశాన్ని పరిపాలిస్తున్న నాయకులు ఎలాంటి స్పందన తీసుకురాలేదన్నారు. దాదాపు మార్చి మూడో తేదీ నుండి ఇప్పటి వరకు మణిపూర్ లో 300 చర్చిలు కూల్చారన్నారు. అక్కడున్న భారతదేశ మహిళలను నగ్నంగా ఊరేగించి వారిని హింసించి చంపేశారన్నారు. దేశంలో ఉన్న పెద్దపెద్ద నాయకులు ఎవరూ స్పందించ లేదన్నారు. సుప్రీంకోర్టు స్పందించి సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తెలపడాన్ని స్వాగతిస్తున్నామని, భారతదేశంలో ఉన్న ప్రతి పార్టీలు ఏకమై మణిపూర్ ప్రాంత ప్రజలకు మంచి చేయాలన్నారు. ఈసిఎఫ్ ద్వారా బుచ్చిరెడ్డిపాలెం లో ఉన్న క్రైస్తవులు, ముస్లింలు, హిందువులు అందరూ కలిసి శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాన్సన్ జాన్ పాల్ రవి ఏజ్రా మనోహర్ రవికుమార్, ఎస్కే జాన్సన్, అరవ పేతు సురేంద్ర, సతీష్ పాల్గొన్నారు.

పంచాయతీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం

విశాలాంధ్ర - నెల్లూరు : ఉలవపాడు మండల ఆత్మకూరులో 5 వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పోటీ చేసిన చిరుతోటి కోటేశ్వర రావు 2 ఓట్ల తేడాతో, మెండా శ్యామల పై గెలుపొందారు. ఈ వార్డులో టీడీపీ గెలుపొందడంతో, స్థానిక నాయ కులు సంబరాలు చేసు కుంటున్నారు. పోలింగ్ అధికారి చేతుల మీదుగా చిరుతోటి కోటేశ్వరరావు డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజక వర్గం టీడీపీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, చిరుతోటి కోటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు కోసం కృషి చేసిన గ్రామస్థాయి, మండల స్థాయి పార్టీ నాయకులందరినీ అభినందిం చారు.

ముట్టుకుంటే షాక్ ఇచ్చే చేపలు చూశారా !

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: ముట్టుకుంటే కరెంట్ షాక్ కొట్టే చేపను ఎక్కడైనా చూశారా..? వెళ్లి చూసి ఆనందించడం వరకే.. దాన్ని ముట్టకుంటే హై ఓల్టేజ్ షాక్ కొడుతుంది. ఇలాంటి అరుదైన చేపలను మన నెల్లూరులోనే ప్రదర్శనకు ఉంచారు. షాక్ కొట్టే ఎలక్ట్రికల్ ఈల్స్ చేపలే కాదండోయ్ అరేబియన్ సముద్రంలో పదివేల అడుగుల లోతులో నివసించే స్టింగరే చేపలు వంటివి ప్రదర్శనకు ఉంచారు. ఇంతకీ నెల్లూరులో అరుదైన చేపల ప్రదర్శన ఎక్కడ అని అనుకుంటున్నారా.. నెల్లూరు ఎస్‌టి ఆర్ నగర్ వద్ద ఎస్ వీ జి ఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ లో... ఈ ఎగ్జిబిషన్ లో అండర్ వాటర్ టన్నెల్ ఏర్పాటు చేసి ప్రపంచంలోనే వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చేపలను ప్రదర్శనకు ఉంచారు.

అరుదైన చేపలు అండర్ టన్నెల్ ఫిష్ అక్వేరియం ఎగ్జిబిషన్ ను భారీస్థాయిలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు జిల్లా ప్రజలు చూడని భారీ సముద్ర, నదుల చేపలు అంటే అమేజాన్ నుండి 6 అడుగుల అరాపైమా చేప తీసుకువచ్చారు. దీని బరువు 160 కేజీలు ఉంటుం ది. 8 కేజీల స్టింగ్రే చేప తీసుకువచ్చి ప్రదర్శనకు ఉంచా రు. సముద్రంలోని ఎలక్ట్రికల్ ఈల్స్, 5.5 అడుగుల ఆలిగేటర్ గార్స్ ని, టార్టిస్ లు, ఫ్లైయింగ్ ఫిష్లు, షార్క్లు, ఈగల్ ఫిష్ లు, ఆర్వాణాలు మొత్తం 2000 నుండి 3000 వరకు చేపలను ఆక్వేరి యమ్ లతో పాటు నాలుగు భూగ ర్భ టన్నెల్ల ద్వారా ప్రదర్శనకు ఉంచారు. సుమారు రూ.50లక్షల ఖర్చుతో పిరానా ఫిష్లు ఐరన్, ఫైబర్ తో అండర్ వాటర్ టన్నెల్ ఏర్పాటు చేయడం విశేషం.

మనం సినిమాల్లో మాత్రమే చూసిన షార్క్ చేప, హనీ మూన్ ఫిష్, లైన్ ఫిష్, హెలీకాప్టర్ షిష్ వంటి అరుదైన చేపలు ఇక్కడ ఉన్నాయి.

విజ్ఞానం, వినోదం ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేకత

వినోదం, విజ్ఞానం పంచడమే ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేకత. నెల్లూరు జిల్లా ప్రజలు ఇంతవరకు చూడని కొత్త రకం 22 ఎమ్యూజ్మెంట్ రైడ్స్ ని, స్టాల్స్ ని ఏర్పాటు చేశారు. అరుదైన చేపలను గుర్తు పట్టే విధంగా అండర్ వాటర్ టన్నెల్ అక్వేరి యంలో పేర్లు కూడా ఉంచారు. దీనివల్ల విద్యార్థులు అరుదైన చేపల వివరాలు, వాటి పేర్లను తెలు సుకుంటారు. వినోదం, విజ్ఞానం పంచే ఎగ్జిబిషన్ ఉద యం పదకొండు గంటల నుంచే ప్రారంభమవుతుంది. రాత్రి పదిగంటలవరకు ఉంటుంది. వర్షం వచ్చినా సందర్శకులు ఇబ్బంది పడకుండా షెల్టర్లు ఏర్పా టు చేశారు. మరెందుకు ఆలస్యం వినోదం, విజ్ఞా నం పంచే ఎగ్జిబిషన్ చూసొద్దాం రండి..

సర్వసభ్య సమావేశంలో కీలక అంశాలపై చర్చ

విశాలాంధ్ర- బిట్రగుంట: బోగోలు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు మేకల సుజా త అధ్యక్షతన శనివారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో పలుకీలక అంశాలపై చర్చించారు. గత సమావేశం నుండి ఈ సమావేశం వరకు మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్ర మాల తాజానివేదికలను సంబం ధిత శాఖల అధికా రులు సభలో చదివి వినిపించారు. ముఖ్యంగా మండలంలో ప్రభుత్వ అనుమతులు పొంది సరి అయి న విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేటు విద్యా సంస్థ లపై విచారణ చర్యలకు సభ్యులు డిమాండ్ చేశారు. సిద్దవరం వెంకటేశ్వర పాలెం గ్రా మంలో ఇందిరా క్రాంతి పథకం ఏపిఎంగా పనిచేస్తూ అమా యక గిరిజనులను మోసంచేసి వారి పొదుపు సంఘాలకు సంబం ధిం చిన 80 లక్షలు స్వాహా చేసి అవి నీతి కి పాల్పడిన వ్యక్తిపై చర్యలకు మండల సభ లో తీర్మానం చేసి కలెక్టర్ కు నివేదిక పంపాలని సభ్యులు కోరారు. 15 వేలు జనాభా కలిగి న బోగోలు మేజర్ పంచా యతీలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టా లన్నారు. నాగుల వరంలో వ్యవసాయ శాఖ సహాయ కుడు గ్రామంలో లేని వారికి వ్యవసాయ ప్రయోజ నాలు కలుగజేస్తూ గ్రామంలో నివసించే వారికి పలు ఆంక్షలు విధించ డంపై సంబంధిత శాఖ అధికారిని ప్రశ్నించారు ఈ కార్యక్ర మంలో జడ్పీటీసీ మద్ది బోయిన కీర్తన, మండల పరి షత్ అభివృద్ధి అధికారి వెంకటసుబ్బారావు, తహశీల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్, పరిపాలనాధికారి గోవిందరావు, అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్ పనులను పరిశీలించిన మేకపాటి

విశాలాంధ్ర -ఉదయ గి రి: పట్టణంలోని ట్యాంక్ బండ్ సుంద రీ కరణ పను లు నియోజకవర్గ సమ న్వ యకర్త మేక పాటి రాజగో పాల్ రెడ్డి శనివా రం పరిశీలించారు. జల వనరుల శాఖ అధికారులతో కలిసి ట్యాంక్ బండ్ మ్యాపును పరిశీలించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. నిర్మాణం జరుగు తున్న ప్రాంతాన్ని కలియ తిరిగిన అనంతరం ఆయన మాట్లా డుతూ ట్యాంక్ బండ్ పనులలో నాణ్యత లోపించకుండా దృఢం గా నిర్మించాలని సూచించారు. నవంబర్ నాటికి ఆనకట్ట పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నీరు నిలువ ఉండే ప్రాంతం అయినందున రివిట్మెంట్ బలిష్టంగా నిర్మించా లన్నారు. ఆనకట్ట పనులు త్వరిత గతిన పూర్తి చేసుకుంటే జనవరిలో ప్రారంభించే అవకాశం ఉందని సూచన ప్రాయంగా మేకపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డిఈ, ఏఈలు, కాంట్రాక్టర్ అక్కి భాస్కర్ రెడ్డి, వైసీపీ నాయకులు పా ల్గొన్నారు.

గిలకపాడు పంచాయతీ వార్డు ఎన్నికల్లో 42 ఓట్లతో వైసిపి విజయం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలో జరిగిన గిలకపాడు పంచాయ తీ వార్డు మెంబర్ కు జరిగిన ఎన్ని కలో పాపకన్ను మధు సూ దన్ రెడ్డి, పాపకన్ను దయాకర్ రెడ్డిల అండ దండలతో వైసీపీ అభ్యర్థి చల్లా రాజగోపాల్ రెడ్డి 42 ఓట్లతో ఘనవిజయం సాధించారు. విజయం సాధించిన రాజగోపాల్ రెడ్డిని మండల ప్రముఖులు పాపకన్ను మధుసూదన్ రెడ్డి, పాపకన్ను దయాకర్ రెడ్డి అభినం దించారు. గిలక పాడు వైసిపి నాయకులు, కార్యకర్తలు పా ల్గొన్నారు.

22వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కావలి: "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా కావలి పట్టణంలోని 22వ వార్డులో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శనివారం పర్యటిం చారు. ఆయనకు వార్డు ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. వైసిపి ప్రభుత్వంలోని ఈ 4 సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటి ఇంటికి తిరిగి ప్రజలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమం లో వైసిపి నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కుందుర్తి కామయ్య పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోనిజీడి కాంప్లెక్స్ లో క్లబ్ ఓల్డ్ ఎలక్ట్రికల్ లైటింగ్ షో రూమ్ ను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రారంభిం చారు. వ్యాపా రం బాగా జరగాలని షాపు యజమాని ని ఆశీర్వదించారు. అనంతరం పట్టణంలోని శ్రీదేవి కన్వెన్షన్ హాల్ నందు జరుగుతున్న వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులు రాకేష్ కుమార్ రెడ్డి, సాయి వైష్ణవి ని ఆయన ఆశీర్వదించారు. అనంతరం పట్టణంలోని వైట్ హౌస్ కన్వెన్షన్ హాల్ లో జరుగుతున్న గొట్టిపాటి కొండపనాయుడు కుమార్తె నలుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు.

ఫొటోగ్రఫీ సంఘం కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: 184వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం స్థాని క ప్రెస్‌క్లబ్‌లో, ఆంధ్రప్రదే శ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. తొలుత కేకును కట్ చేసి జర్నలిస్టులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ల వృత్తిపై అనుభవాలను వ్యక్తం చేశారు. ఎన్నో ఒడిదు దుకులను ఎదుర్కొంటూ, జర్నలిజంలో మక్కు వతో ఫోటోగ్రఫీలో కొనసాగుతున్నామని తెలిపారు. అనంతరం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ ఫోటోగ్రాఫర్ల ఏపీపీ జేఏ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గౌరవ అధ్యక్షులుగా డిటీ.హరికృష్ణ, అధ్యక్షులుగా ఎస్ కె. జాకీర్, ఉపాధ్యక్షులుగా జి.దేవసహాయం, కార్యదర్శిగా ఎస్ కె. ముజూ, కోశాధికారిగా ఎం.వెంకట్రావు, సభ్యులు ఎస్.మాల్యాద్రి, గణేష్ లు ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోటో జర్న లిస్టులు నందా, మాల్యాద్రి, దేవ సహాయం, వెంకట్రావు, ముజ్జు, జాకీర్, విజయ్‌కృష్ణ, గణేష్, హరి కృష్ణ పలువురు మీడియా నేతలు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 45/1 జేమ్స్ గార్డెన్, 46/2 కాపువీధి వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాల యాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్ట రులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివా లయాల పరిధిలోని ప్రజలకు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందిస్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్తపరీక్షలు తదితర సేవలపై అవగాహన కల్పించాలని కమిషనర్, సూచించారు. సచివాలయాలలో పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్య దర్శులకు కమిషనరు సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశా లపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్‌ప్లాన్‌ను అమ లు చేయాలని తెలి పారు. స్పందన, జగ నన్న కు చెబు దాం ఫిర్యాదులు, నాడు - నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లోని బద్ధత పాటించాలని, తమకు నిర్దేశిం చిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలే అవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్య వేక్షించాలని అమెనిటీస్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: మేకపాటి

విశాలాంధ్ర- ఉదయగిరి: మండ లం లో పార్టీలకు అతీతంగా అర్హు లందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని నియోజక వర్గ సమన్వయకర్త మేకపాటి రాజగో పాల్ రెడ్డి స్పష్టం చేశారు శనివారం స్థానిక శ్రీ శక్తి భవనంలో సచివాలయ సిబ్బంది వాలంటీర్ల తో సమీక్షా సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వంలో కీలక భాగస్వా ములు చేసి పరిపాలన ప్రజలకు అందిస్తున్నారని, గతంలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కావాలంటే రాజకీయ పార్టీ నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ప్రభుత్వం వాలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి తలుపు తట్టి అందిస్తోందన్నారు. వ్యక్తిగత సమస్యల ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీరును ఏర్పాటు చేసి ఆ కుటుంబ సభ్యుడిగా వాలంటీరు ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. కరోనా కాలంలో వారి సేవలు అభినందనీయం అన్నారు. వాలంటీర్ల భవిష్యత్తు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతగానో తపన పడుతున్నారని రానున్న రోజుల్లో వాలంటీర్ల జీతాలు పెంచే ఆలోచనలు ప్రభుత్వం ఉందన్నారు. మండలంలో 12 సచివా లయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు సంవత్స రాలలో రూ.100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు వైసీపీకి ఘన విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరో మారు రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసుకొని బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేకపాటి అభినవ్ రెడ్డి, ఎంపీడీవో ఎన్ మల్లికార్జున్, ఈవోపీఆర్డి ఆర్ నరసయ్య, జడ్పీ కో ఆప్షన్ నెంబర్ షేక్ గాజుల తాజుద్దీన్, మండల సర్పంచుల అధ్యక్షులు కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, వైసీపీ మండల నాయకులు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

18 పాఠశాలలలో ఉపాధ్యాయులను నియమించాలి

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో సుమారు 300 ఉపాధ్యాయులను నియమిం చాలని, రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. రాజమనోహర్ శనివారం ఒక ప్రకటనలో డి మాండ్ చేశారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద పాఠ శాలల్లో ఉపాధ్యాయులను నియమించేలా, జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు చేపట్టాలని కోరారు. నగర కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో నగరంలో సుమారు 50 ఉన్నాయని తెలిపారు. వీటిలో సుమారు 100 మంది టీచర్ల కొరత ఉందని తెలిపారు. ఉన్నత పాఠ శాలలో 16 ఉన్నాయని వీటిలో సుమారు 200 మంది టీచర్ల కొరత ఉందని తెలిపారు. ఈ పాఠశాల అన్నింటిలో పేద విద్యార్థుల విద్యానికే విశిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు లేక వీరందరికీ తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ పాఠశాలన్నింటిలో ఉపాధ్యా యులను నియమించేలా జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు చేపట్టాలని కోరారు.

పీఎం విశ్వకర్మ పథకం ప్రవేశపెట్టడం హర్షనీయం

-విశ్వకర్మ కౌసల్య యోజన సెల్ జిల్లా కన్వీనర్ ఆర్మాట్ కుమార్



విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: పీఎం విశ్వకర్మ పథకం పేరుతో, దేశ ప్రధాని నరేంద్ర మోడీ పథకాన్ని ప్రవేశపెట్టడం హర్షనీయమని, విశ్వకర్మ కౌసల్య యోజన సెల్ జిల్లా కన్వీనర్ ఆర్మాట్ కుమార్ అన్నారు. స్థానిక కొరడావీధిలోని ఆ యోజన సెల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో తరతరాలుగా కులాల వారీగా వస్తున్న వారసత్వ కుల వృత్తులను మరింత బలోపేతం చేసేలా, ఈ నూతన పథకాన్ని ప్రవేశపెట్టడం గొప్ప విషయమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశ్వకర్మ జయంతి సెప్టెంబర్ 17వ తేదీ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచే రోజు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. సాంప్రదాయ చేతివృత్తులు చేసుకునే వారికి ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద తొలి విడతలో లబ్ధిదారులు వృత్తిలో నైపుణ్యత పెంచుకునేందుకు లక్ష రూపాయలు, 5 శాతం స్వల్ప వడ్డీకి రుణాన్ని పొందవచ్చని తెలిపారు. రెండో విడతలో అర్హత కలిగిన లబ్ధిదారులు రెండు లక్షలు వరకు రుణాన్ని పొందవచ్చన్నారు. చేతి వృత్తులు చేసుకునే వారికి ట్రైనింగ్ ఇస్తూ, రోజుకి 500 రూపా యల జీతం కూడా కేంద్ర ప్రభుత్వ చెల్లించనుందని తెలిపారు. రోజువారి జీవన విధానం దెబ్బతినకుండా చేతివృత్తులు నేర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చే మంచి పథకం అన్నారు. ట్రైనింగ్ (శిక్షణ) వృత్తి నైపుణ్యత పెంచుకున్న తర్వాత పనిముట్లు కొనుగోలు చేసుకునేందుకు రూ.15 వేల రూపాయలు ఉచితంగా ఆర్థిక సహాయం పథకం ద్వారా పొందవచ్చన్నారు. స్వర్ణకార, చేనేత, వడ్రంగి, రజిక, కుమ్మరి తదితర మొత్తం 18 రకాల సంప్రదాయ వృత్తుల వాళ్లకు ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సహాయం అందించనుందని ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా స్వర్ణకారులు, చేనేత, వడ్రంగి రజిక తదితర సంప్రదాయ వృత్తుల వారు అభివృద్ధి చెందాలని కోరారు.

బొజ్జన పల్లి పంచాయతీ వార్డు ఎన్నికల్లో 23 ఓట్లతో టిడిపి విజయం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలో జరిగిన బొజ్జన పల్లి పంచాయతీ వార్డు మెంబ ర్ కు జరిగిన ఎన్నికలో టిడిపి అభ్యర్థి నిమ్మల రవణమ్మ సమీప వైసిపి అభ్యర్థి పై 23 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. విజయం సాధించిన నిమ్మల రమణమ్మ ను మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ విజయానికి కృషి చేసిన మండల టిడిపి అధ్యక్షులు దందోలు వేంకటేశ్వరరెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండ్లపా డి రాఘవరెడ్డి, తిరుపతి పార్ల మెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, రాష్ట్ర ఎస్ సి సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరి పచ్చిగళ్ళ రత్నం, మండల మహిళా అధ్యక్షురాలు రమణమ్మ లను బొజ్జనపల్లి పంచాయతీ టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్ల య్య, రమేష్, శ్రీధర్ రెడ్డి, చంద్ర రమణయ్య, వెంకటేశ్వర్లు, సాయి, మాజీ మండల ఉపాధ్యక్షులు మధు నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాకుపల్లిలో మహాశక్తి చైతన్యరథ యాత్ర

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో కాకుపల్లి లో మహాశక్తి చైతన్య రథ యాత్ర కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డనిధి కింద నెలకు 1500 రూపాయలు నేరుగా మీఇంటికే చేరుతాయన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుకొనే ప్రతి బిడ్డకు సంవత్సరానికి 15 వేల రూపాయలు నేరుగా ఆ తల్లికే చేరుతాయన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారు. చదువుకొని ఉద్యోగం లేని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి పేరుతో నెలకు 3 వేల రూపాయలు అందిస్తారన్నారని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ కార్య క్ర మంలో ఉప్పల ఈశ్వరయ్య గౌడ్, కుంచనపల్లి శివ కు మార్, వెంకట ర త్నం, మోహన్ రా వు, రాజగోపాల్ రెడ్డి, సునీల్ కుమార్, రూపేష్, దామోదర్, శ్రీనివాసులు, శీను, చిరమన సూర్యం, మాలతి, సుబ్రహ్మణ్యం, కోటేశ్వర రావు, ఉప్పల శ్రీహరి, ఉప్పల లోకేష్, ఉప్పల రవి, శివ కుమార్, చంద్ర శేఖర్, తాటిపర్తి మనోహర్, తాటిపర్తి సుధాకర్, ఈగ సుధాకర్, నిరంజన్, నవీన్,నరేంద్ర పాల్గొన్నారు.

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ పెండ్లి కానుక అందజేత

విశాలాంధ్ర- నెల్లూరు: కలిగిరి మండలంలోని కృష్ణారెడ్డి పాలెంలో గంగపట్ల మాలకొండయ్య, అంకమ్మరాగి కనిష్ఠ పుత్రుడు దానియేల్ వివాహం సంద ర్భం గా, ఉదయగిరి నియోజకవర్గం టీడీపీ నాయకులు, కాకర్ల ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ తరపున పదివేల రూపాయలను పెండ్లి కానుకగా అందించి వధూవరులు దానియేల్-కీర్తి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోకల మాల్యాద్రి (కొండారెడ్డి), తోక ల శ్రీరామ్ కృష్ణ, గంగపట్ల శ్రీరాములు, కేసనపల్లి మధు, ఆత్మకూరు మల్లి కార్జున, గంగపట్ల ఏడుకొండ లు, కర్ర అడివయ్యా, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ

విశాలాంధ్ర- కలువాయి: మండలకేంద్రంలోని బివి ఎన్ ఆర్ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు ఐరన్ లో పం ఉన్న విద్యార్థులను గు ర్తించి ఆ విద్యార్థులకు అవసరమైన ఐరన్ టాబ్లెట్లను పాఠశాల ఇంచార్జి ప్రధానో పాధ్యాయులు చల్లా మల్లికార్జున్ రెడ్డికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది ఐరన్ టాబ్లెట్లను అందించారు. ఐరన్ లోపం ఉన్న విద్యార్థులు ఈ టాబ్లెట్లు వేసుకొని ఐరన్ లోపం లేకుండా విద్యనభ్యసించాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిఆర్పి మహేష్, ఏఎన్ ఎం సునంద, ఎంఎల్‌హెచ్‌పీ షారుణ్, ఆశ ఝాన్సీ పాల్గొన్నారు.

మూడు వార్డులలో వైసిపి ఘనవిజయం

- కొనసాగుతున్న ఫ్యాన్ గాలి- ఉత్సాహంలో వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-మనుబోలు: మను బోలు మండలంలో మనుబోలు, మడమనూరు, బండేపల్లి గ్రామాల్లో వార్డు ఎన్నికలు శనివారం జరిగా యి. అనంతరం అధికారులు రెం డు గంటలకు కౌంటింగ్ ప్రారం భించారు. వైసీపీ బలపరిచిన అభ్యర్థి ఆదిలక్ష్మి మనుబోలు నాలుగో వార్డ్ లో 26 ఓట్లతో గెలుపొందింది. బండేపల్లిలో ఒక్క ఓటుతో వైకాపా అభ్యర్థి ఆవుల రమణమ్మ విజయం సాధించారు. మడమనూరులో వైసీపీ అభ్యర్థి దేవసేనమ్మ 18 ఓట్లతో గెలుపొందింది. వార్డు ఎన్నికల్లో విజయం సాధించడంతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొం ది. వార్డులో అభ్యర్థి తో పాటు నా యకు లు పర్య టించి విజ యం అందిం చిన ప్రజలకు అభివాదం చేశా రు. అధికారులు విజయసారథులకు డిక్లరేషన్‌ను అందిం చారు. ఈ కార్యక్రమం లో చిట్టమూరు అజయ్ కుమార్ రెడ్డి, మనుబోలు ఉప సర్పంచ్ జెసియస్ మండల కన్వీనర్ కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, బొమ్మిరెడ్డి మధు రెడ్డి, దాసరి భాస్కర్ గౌడ్ ,ముంగర రవీందర్ రెడ్డి, పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం రూ.12,38,329

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలంలో ని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంను దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ మొక్కులు తీర్చు కొన్నారు. దేవస్థానం అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు ఈ రోజు భక్తుల ద్వారా వివిధ రూపాలలో దేవస్థానంకు రూ.12,38,329 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.బి శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్రం ద్వారా రూ 8,350 రూపాయలు, కుంకుమార్చన ద్వారా 26,200రూ, తలనీలాల ద్వారా రూ57,500 రూ,వాహన పూజలద్వారా 7,440 రూపాయలు ఆదాయం వచ్చింది. ప్రత్యేక దర్శనం ద్వారా 3,18,300 రూపాయలు, స్థల పురాణం ద్వారా 660రూ, రూము అద్దెలు ద్వారా 31,250రూ,కవర్లు ద్వారా 11,400 రూపాయలు, లడ్డూ ప్రసాదం ద్వారా 2,19,180 రూపా యలు, అన్నప్రసాదాలద్వారా 5,09,0 49 రూపాయలు, ఇతర విరాళాలు 32,000 రూపాయలు, వివాహాల ద్వారా 17,000 మొత్తం 12,38,729 రూపాయ లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి కె.బి శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా పెనుశిలలక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలం లోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోన క్షేత్రం లో శనివారం సందర్భంగా శ్రీవార్ల కు ఉదయం 4 గంటలకు అభిషే కం, 10.30 గంటలకు కళ్యాణోత్సవం, సాయంత్రం 5.30గంటలకు చెం చు లక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి వారి కి తిరుచ్చి పల్లకి సేవ ప్రధాన అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణలతో మంగళ వాయిద్య, గిరిజనుల వాయిద్య నడుమ సహస్ర దీపాలంకరణ సేవ(ఊంజల్ సేవ) వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుం డా క్యూలైన్ల ఏర్పాట్లు, మంచి నీటి సరఫరా,అన్నదానం, తదితర కార్యక్రమాలలో సహా య కమిషనర్, కార్య నిర్వాహణాధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించారు.